## యుద్ధం.. సన్నద్ధం

మనల్ని హింసించేందుకు..
మనల్ని సంహరించేందుకు..
'శత్రువులు' ముట్టడిస్తుంటారు..
'యుద్ధం' సాగిస్తుంటారు..!

హింసను తప్పించుకునేందుకు..
ప్రాణాలను రక్షించుకునేందుకు..
'శత్రువులను' తుదముట్టించేందుకు..
'సన్నద్ధం'గా ఉండాలి..!!

ఆ 'శత్రువు' పేరు.. దోమ..!
ఆ 'యుద్ధం' పేరు.. కాటు..!!
ఆ 'సన్నద్ధత' పేరు.. పరిశుభ్రత..!!!

# దోమలపై యుద్ధం.. కావాలి సన్నద్ధం


అన్నపురెడ్డిపల్లిలో..

మనందరినీ కుట్టి కుట్టి.. హింసించేందుకు, జబ్బున పడేసి.. ప్రాణాలు తీసేందుకు, దోమల దండు.. దండయాత్రకు బయల్దేరింది.

ఈ దండు నుంచి, దండయాత్ర నుంచి తప్పించుకునేందుకు ఎవరికి వారు అప్రత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చూడ్డానికి అత్యంత సూక్ష్మంగా కనిపించే ఈ శత్రు జీవి సాగించే 'భయంకర యుద్ధం' నుంచి తప్పించుకునేందుకు ఎవరికి వారు ఎలా 'సన్నద్ధం' కావాలో వివరిస్తూ వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది శుక్రవారం 'జాతీయ డెంగీ నివారణ దినోత్సవం' సందర్భంగా జిల్లావ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించారు. దోమలు పుట్టకుండా ఉండాలంటే ఇంటినీ–పరిసరాలనూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రధానంగా– కొద్దిపాటి నీరు కూడా నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. ఇప్పటికే ఉన్న దోమల నుంచి రక్షించుకునేందుకు దోమ తెరలు వాడాలని, ఇతరత్రా మార్గాలు అనుసరించాలని సూచించారు. దోమల కారణంగా వచ్చే జ్వరాల్లో డెంగీ.. అత్యంత ప్రమాదకరమైనదని, ఒక్కోసారి ఇది ప్రాణాలను కూడా బలిగొంటుందని హెచ్చరించారు. అందుకే– మన పాలిట శత్రువులుగా మారిన దోమలతో అప్రమత్తంగా ఉండాలని, ఈ శత్రు మూకను సమూలంగా సంహరించేందుకు **'పరిశుభ్రత'**, **'నిల్వ నీరు తొలగింపు'** అనే **'ఆయుధాల'**తో సర్వ **'సన్నద్ధం'**గా ఉండాలని, విజయవంతంగా **'యుద్ధం'** సాగించాలని జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు.

**– నమస్తే నెట్‌వర్క్**


చర్ల మండలం కొయ్యూరు పీహెచ్‌సీలో..


కరకగూడెంలో..


ఇల్లెందు మండలంలో..

# అతిగా వాడొద్దు యూరియా.. దెబ్బతింటుంది ఏరియా


మాట్లాడుతున్న శాస్త్రవేత ప్రవంతి

అశ్వారావుపేట రూరల్, మే 16: రైతులు యూరియాను అతిగా/అధిక మోతాదులో వాడితే ఆ ప్రాంత( ఏరియా) భూమిలోని మిత్ర పురుగుల సంఖ్య తగ్గుతుందని, భూసారం దెబ్బతింటుందని, సాగు ఖర్చులు కూడా పెరుగుతాయని స్థానిక వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు డి.ప్రవంతి, డాక్టర్ పి.శ్రీలత హెచ్చరించారు. మండలంలోని ఆసుపాక పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పంట మార్పిడితో సుస్థిర ఆదాయం పొందవచ్చన్నారు. సమగ్ర సస్యరక్షణ చర్యలతో పురుగు మందుల వాడకం తగ్గించకపోతే.. ఆహార ఉత్పత్తులు విషతుల్యమవుతాయని, మానవాళి ఆరోగ్య క్షీణిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. నీటి కుంటలు, ఇంకుడు గుంతలు నిర్మాణంతో భూగర్భ నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచవచ్చని చెప్పారు. వ్యవసాయాధికారి శివరాం ప్రసాద్, వినాయకపురం పశు వైద్యశాల డాక్టర్ స్వప్న, ఏఈవోలు రవీంద్ర, సతీష్, షాకీరాభాను, పంచాయతీ కార్యదర్శి మోతీలాల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శాస్త్రవేత్త శ్రీనివాస రావు

ఇల్లెందు, మే 16: యూరియాను అవసరానికి మించి వాడితే.. ఏమాత్రం ప్రయోజనం లేకపోగా తీవ్ర నష్టాలు ఉంటాయని, అనవసరం ఖర్చు పెరుగుతుందని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాసరావు, నవీన్‌కుమార్, ఇల్లెందు ఏడీఏ లాల్‌చంద్ హెచ్చరించారు. మండలంలోని బేతంపూడి పంచాయతీలో శుక్రవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. యూరియాను అతిగా వాడితే చీడపీడల బెడద పెరుగుతుందని, సాగు ఖర్చు తడిచి మోపెడవుతుందని వివరించారు. లోతు దుక్కులు దున్నడం వలన కీటకాలు నశిస్తాయని చెప్పారు. తొలకరిలో పచ్చిరొట్ట సాగు చేసి కలియదున్నితే పంటలో కార్బన్ శాతం పెరిగి భూమి ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి, మొక్కజొన్న బదులుగా అపరాల పంటలైన పెసర, మినుము, కంది సాగు చేస్తే భూసారం పెరుగుతుందని వివరించారు. పామాయిల్, మునగ, వెదురు సాగుతో మంచి లాభాలు ఉంటాయన్నారు. మండల వ్యవసాయాధికారి అన్నపూర్ణ, ఏఈవోలు శ్రావణి, ప్రవీణ్, రమేష్, భాగ్యశ్రీ పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు

దమ్మపేట, మే 16: రసాయనిక ఎరువులను మోతాదుకు మించి వాడితే.. అవి ఆహారోత్పత్తులను విషపూరితంగా మారుస్తాయని, నేల తల్లి ఆరోగ్యం క్షీణిస్తుందని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అధ్యాపకులు డాక్టర్ పావని, డాక్టర్ కృష్ణతేజ, అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ రవికుమార్, మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని బాలరాజుగూడెంలో శుక్రవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. వర్షాధార పంటల సాగు విషయంలో అధికారుల సలహాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. జాతీయ స్థాయిలో భూగర్భ జలాలు అతి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో దమ్మపేట మండలం ఉందని తెలిపారు. రైతులకు ఉపయోగపడేలా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు 'వ్యవసాయం దిక్సూచీ' ప్రచురిస్తున్నారని చెప్పారు. దీనిని చదివితే అనేక విషయాలు తెలుస్తాయని, అధికారులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుందని అన్నారు. పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి


మాట్లాడుతున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు, మే 16: ప్రజలు తమ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను కోరారు. ఆయన శుక్రవారం టేకులపల్లి పోలీస్ స్టేషన్‌లో ముస్లిం, హిందూ, క్రైస్తవ పెద్దలతో సమావేశమయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ.. బక్రీదు పండుగ ప్రశాంత వాతావరణంలో పండగలు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. సీఐ టి.సురేష్, ఎస్సైలు రాజేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ, మే 16 : పాల్వంచ పట్టణం, మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో శనివారం శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పాల్వంచలోని కేటీపీఎస్ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కలెక్టరేట్ ఆవరణలో రూ.1.96 కోట్లతో నిర్మించే 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్, శ్రీనివాసకాలనీలో రూ.3.13 కోట్లతో, పాండురంగాపురం గ్రామంలో రూ.2.63 కోట్లతో నిర్మించే 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం యానంబైలు గ్రామంలోని కిన్నెరసాని నదిపై రూ.9.70 కోట్లతో నిర్మించిన హైలెవల్ వంతెనను ప్రారంభించి ఆ తర్వాత సోములగూడెంలోని బూడిదవాగుపై రూ.4 కోట్లతో నిర్మించనున్న హైలెవల్ వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని పేర్కొన్నారు. సమావేశంలో కొత్వాల శ్రీనివాసరావు, కమిషనర్ సుజాత, డీఎస్పీ సతీష్‌కుమార్, సాబీర్‌పాషా, సీతారాములు, రంగారావు, వెంకన్న పాల్గొన్నారు.

## పాల్వంచ పట్టణ సమగ్రాభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ, మే 16 : పాల్వంచ మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్‌కాలనీ నెహ్రూనగర్, శివనగర్, పేటచెరువు, శ్రీనివాస్ కాలనీ, అయ్యప్పనగర్ ప్రాంతాల్లో రూ.1 కోటి 95లక్షల 90వేల నిధులతో సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి బస్తీలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి నిధులు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. రహదారులు తాగునీరు విద్యుత్ సమస్యకు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపించి తీరుతామని, ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దారా ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ సుజాత, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ముత్యాల విశ్వనాథం, టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములు, పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, బండి నాగేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

- విద్యుత్ తీగలు తగిలి యువకుడు..
- దండెం తీగలకు విద్యుత్ ప్రసరించి మహిళ


వంశీ (ఫైల్)


రూప (ఫైల్)

భద్రాచలం/అశ్వారావుపేట, మే 16: విద్యుత్ ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. ఒకచోట– ట్రాన్స్‌ఫార్మర్ తీగ తగిలి యువకుడు, మరోచోట– దండెం తీగకు విద్యుత్ ప్రసరించడంతో మహిళ ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాలు..

**భద్రాచలంలో యువకుడు..**

ములుగు జిల్లా వాజేడు మండలం జగన్నాథపురం గ్రామస్తుడు సోమిడి వంశీ(23), భద్రాచలంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. సామ్రాట్ లాడ్జిలోని ఓ గదిలో నివాసముంటున్నాడు. అతడు శుక్రవారం ఉదయం బ్రష్ చేసుకుంటూ ఫోన్ మాట్లాడుతున్నాడు. లాడ్జి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగ తగిలింది. షాక్‌తో అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఐదు నిముషాలపాటు విద్యుత్ తీగలకు అతుక్కుపోయాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కుటుంబీకులు, బంధువులు అక్కడకు చేరుకున్నారు. వంశీ మృతికి విద్యుత్ శాఖ అధికారులు, లాడ్జి నిర్వాహకులే కారకులని ఆరోపిస్తూ మృతదేహంతో ఆందోళనకు దిగారు. ప్రమాద వివరాలను పోలీసులు తెలుసుకున్నారు. ప్రాథమిక దర్యాప్తు చేపట్టారు.

**వినాయకపురంలో మహిళ..**

అశ్వారావుపేట, మే 16: మండలంలోని వినాయకపురం గ్రామస్తురాలు వేల్పుల రూప(24), శుక్రవారం తన బిడ్డకు పాలు ఇచ్చి నిద్రపుచ్చింది. ఉతికిన బట్టలను ఇంటి ఎదుట రేకుల పందిరి స్థంభాలకు ఇనుప తీగతో కట్టిన దండెంపై ఆరవేస్తుండగా విద్యుత్ షాక్ తగిలింది. స్పృహ కోల్పోయి కింద పడింది. కుటుంబ సభ్యులు వెంటనే అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి, ఆమె అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. రూప భర్త కిషోర్ ఫిర్యాదుతో కేసు నమోదైంది. ఎస్సై యయాతి రాజు దర్యాప్తు చేస్తున్నారు. విద్యుత్ మీటరుకు స్థంభం నుంచి ఇచ్చిన వైరు.. రేకుల తాకిడికి తెగడంతో విద్యుత్ సరఫరా అయిందని వివరించారు.

## కాంగ్రెస్‌లో 'ఇండ్ల' లొల్లి

### చెప్పలతో కొట్టుకున్న నాయకులు



చెప్పలతో కొట్టుకుంటున్న నాయకులు

మణుగూరు టౌన్, మే 16: ఇందిరమ్మ ఇండ్ల వ్యవహారం.. కాంగ్రెస్‌లో కుంపటి రాజేసింది. ఆ పార్టీ నాయకులు చెప్పులతో కొట్టుకున్నారు. మణుగూరు మండలం అన్నారం గ్రామంలోని ఇద్దరు కాంగ్రెస్ నాయకులు.. ఇందిరమ్మ ఇండ్ల 'పంపకం' కోసం శుక్రవారం తహసీల్ కార్యాలయానికి చేరుకున్నారు. సమీపంలోని టీ స్టాల్ వద్దకు వెళ్లారు. అక్కడ గొడవపడ్డారు. వాగ్యుద్ధం ముదిరింది. చెప్పులతో కొట్టుకున్నారు. ఈ 'యుద్ధాన్ని' అక్కడున్న వారంతీ వింతగా, విస్మయంగా చూస్తుండిపోయారు.

## అన్నదానానికి రూ.2లక్షల విరాళం

భద్రాచలం, మే 16: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో అన్నదానం కోసం గుంటూరుకు చెందిన భక్తురాలు సీహెచ్ సరస్వతి శుక్రవారం రూ.2లక్షలు విరాళంగా అందజేశారు. ముందుగా, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## షెడ్ల నిర్మాణానికి భూమి పూజ

భద్రాచలం, మే 16: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన ఏపీలోని ఎటపాక మండలం పురుషోత్తపట్నంలోగల శ్రీగోకుల రామంలో షెడ్ల నిర్మాణానికి ఆలయ ఈవో రమాదేవి శుక్రవారం భూమి పూజ చేశారు. గోకులరామంలో గోవుల కోసం రెండు షెడ్లను నిర్మిస్తున్నారు. ఇందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని ప్రవాస భారతీయులు సూదిరెడ్డి రామకృష్ణారెడ్డి–శాంత, సత్యనారాయణరెడ్డి–విజయ దంపతులు అందించారు.

## కరకగూడెంలో జోరు వర్షం


మోతేలో ధాన్యం రాశుల చుట్టూ చేరిన వర్షపు నీరు

కరకగూడెం, మే 16: మండలవ్యాప్తంగా శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటలపాటు గాలిదుమారంతో జోరున వర్షం కురిసింది. మోతే, తాటిగూడెం, కరకగూడెం గ్రామాల్లో రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం తడిచింది. గాలి దుమారానికి మండలంలోని పడిగాపురం గ్రామంలో బాడిశ సురేష్ రేకుల ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఆ కుటుంబ నిరాశ్రయులయ్యారు.


ఇంటిపై రేకులు ఎగిరిపోవడంతో ఆశ్రయం కోల్పోయిన కుటుంబం

## ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెంపు


ఇంకుడు గుంత పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

అన్నపురెడ్డిపల్లి, మే 16: ఇంకుడు గుంతల నిర్మాణాలతో భూగర్భ జలాలు పెరుగుతాయని డీఎల్‌పీవో ప్రభాకర్ అన్నారు. మండలంలోని మర్రిగూడెం పంచాయతీలో ఆయన శుక్రవారం పర్యటించారు. ఇంకుడు గుంతల నిర్మాణ పనులను పరిశీలించారు. ఇంకుడు గుంతలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఎంపీవో షబ్నా, పంచాయతీ కార్యదర్శి బాలోజీ పాల్గొన్నారు.

## అనారోగ్య బాధితులకు సాయం

భద్రాచలం, మే 16: భద్రాచలానికి చెందిన అలవాల విజయ్, ఎస్.మమత.. అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారికి రూ.10వేల చొప్పున సాయాన్ని వసుధ ఫౌండేషన్ తరపున రామాలయం ఈవో రమాదేవి శుక్రవారం అందజేశారు. ఫౌండేషన్ కన్వీనర్ వేగేశ్న శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ నమూనా ఇల్లు ప్రారంభం

మణుగూరు టౌన్, మే 16: ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇంటిని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శుక్రవారం ప్రారంభించారు. తహసీల్దార్ ఇమ్మానియేలు, ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మె వాయిదా

ఇల్లెందు, మే 16: ఈ నెల 20న జరగాల్సిన సార్వత్రిక సమ్మెను, యుద్ధ వాతావరణం కారణంగా జూలై 9వ తేదీకి వాయిదా వేసినట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి తెలిపారు. ఆయన శుక్రవారం ఇల్లెందులో సమావేశంలో ఈ విషయం చెప్పారు. నాయకులు వెంకటేశ్వర్లు, ఉపేంద్రాచారి, అంజన్న, నాగరాజు, కృష్ణ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

టేకులపల్లి, మే 16: టేకులపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు కలిసి అంగన్‌వాడీ టీచర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని టేకులపల్లి అంగన్‌వాడీ కేంద్రం–2 టీచర్ కుంజ భద్రమ్మ శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ప్రాజెక్ట్ ఆఫీసర్ తారను 'నమస్తే' వివరణ కోరింది. ''ప్రాజెక్ట్ పరిధిలో వసూలు చేసినట్లు నా దృష్టికి రాలేదు. అలా జరిగినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం'' అన్నారు.

## సొసైటీ సీఈవోపై విచారణ

అశ్వారావుపేట, మే 16: ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడుతున్నట్లుగా అశ్వారావుపేట సొసైటీ సీఈవో మానేపల్లి విజయ్ బాబుపై పాలకవర్గ సభ్యుడు బత్తిన పార్థసారథి, కొందరు రైతులు ఇటీవల డీసీవో ఖుర్షిద్‌కు ఫిర్యాదు చేశారు. డీసీవో ఆదేశంతో సీనియర్ ఇన్‌స్పెక్టర్ వీరేష్ బాబు శుక్రవారం విచారణ జరిపారు. చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ సమక్షంలో సొసైటీ కార్యాలయంలో ఫిర్యాదుదారులు, రైతుల నుంచి వివరాలు సేకరించారు. సీఈవోపై పూర్తి విచారణ కొనసాగుతోందని, ప్రస్తుతానికి ధాన్యం కొనుగోళ్లపైనే విచారించామని తెలిపారు. నివేదికను డీసీవోకు అందిస్తానన్నారు.

## జాతీయ డెంగీ దినోత్సవ ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మే 16 : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవాన్ని నిర్వహించారు. కొత్తగూడెం పట్టణంలోని పాత డిపో సెంటర్‌లో ఈ ర్యాలీని డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. డెంగీ నివారణ, నియంత్రణ గురించి అవగాహన పెంచడానికి ప్రతి ఏడాది మే 16వ తేదీన డెంగీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని చెప్పారు. ఈ సందర్భంగా చెక్, క్లీన్ అండ్ క్లియర్ అనే థీమ్‌తో పౌరులు నీటి స్తబ్దతను తనిఖీ చేయాలని సూచించారు. ప్రోగ్రాం ఆఫీసర్ స్పందన, డిప్యూటీ డీఎంహెచ్‌వో జయలక్ష్మి, యూపీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది కుమారస్వామి, జేతు, నగేష్, చేతన్ పాల్గొన్నారు. మొర్రేడువాగు నుంచి కొత్తగూడెం రైల్వేస్టేషన్ వరకు ర్యాలీ కొనసాగింది.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**– డీఎస్పీ అబ్దుల్ రెహమాన్**


మాట్లాడుతున్న డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మే 16 : పోక్సో చట్టం, సైబర్ నేరాల పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. జిల్లా విద్య శిక్షణ కేంద్రం కొత్తగూడెంలో జరుగుతున్న ఆంగ్ల ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో భాగంగా పోక్సో చట్టం, బాలికల అక్రమ రవాణా, సైబర్ నేరాల పట్ల ఉపాధ్యాయులందరికీ డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ వివరించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ సతీష్‌కుమార్, వన్‌టౌన్ సీఐ కరుణాకర్, ఎస్సై విజయ, రీసోర్స్‌పర్సన్లు సైదులు, మీరా హుస్సేన్, మురళి, హరిబాబు పాల్గొన్నారు.

## భద్రాద్రిలో రామయ్యకు స్వర్ణ కవచాలంకరణ


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, మే 16: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానం అంతరాలయంలో మూలవరులకు అర్చకులు శుక్రవారం సర్వాంగ స్వర్ణ కవచాలను ధరింపజేశారు. కల్యాణ మూర్తులకు బేడా మండపంలో నిత్య కల్యాణం నిర్వహించారు.

## తొమ్మిది మందికి జరిమానా

కొత్తగూడెం టౌన్, మే 16 : మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 9 మందికి జరిమానా విధిస్తూ కొత్తగూడెం స్పెసల్ జుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు శుక్రవారం తీర్పు చెప్పారు. కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్సై విజయ వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒకరు, లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు, పాల్వంచ టౌన్ ఎస్సై జీవన్‌రాజ్ తనిఖీలు చేస్తుండగా ఆరుగురు మొత్తం తొమ్మిది మందిని వేరువేరు చోట్ల బ్రీత్ ఎనలైజర్ల ద్వారా పరీక్షించగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. వారిని కోర్టులో ప్రవేశపెట్టగా తాము మద్యం తాగినట్లు అంగీకరించడంతో జడ్జి వారికి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

## యువకుడి ఆత్మహత్య

బూర్గంపహాడ్, మే 16: ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలు.. మండలంలోని చలమప్పగూడెంగ్రామస్తుడు ప్రేమ్‌కుమార్ అలియాస్ మేఘన(20), ఆరు నెలల క్రితం యువతిగా వేషం మార్చుకుని, మండలంని సందెళ్ల రామాపురంలో హిజ్రాలతో కలిసి ఉంటున్నాడు. ఆరోగ్యం బాగోలేకపోవడంతో గత నెల 16న కొత్తగూడెం ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. ఆరోగ్య విషయమై తీవ్ర మానసిక వేదన పడుతున్న అతడు ఈ నెల 13న సందెళ్ల రామాపురం నుంచి బయటకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం చెట్టుకు శవమై వేలాడుతుండాన్ని స్థానికులు గమనించి పోలీసులకు తెలిపారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని భద్రాచలం ఆస్పత్రికి ఎస్సై రాజేష్ తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మణుగూరు టౌన్, మే 16: మణుగూరులోని గుట్టమల్లారం వద్ద శుక్రవారం బైక్, కారు ఢీకొన్నాయి. కారు అదుపు తప్పి, రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొంది. బైక్‌పై ప్రయాణిస్తున్న పాములపల్లికి చెందిన ఇర్పా రాంబాబు, లక్ష్మణ్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108 సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది.